# నిప్పు

సింగరాజు రామచంద్రమూర్తి



నిద్రలేచిన రమణమూర్తికి పక్క గదిలోని అలివేలు గొంతు వినబడడంతో మత్తు పూర్తిగా వదలి పోయింది. ఆమె చెప్పేది వినబడుతుందేమోనని ఆసక్తితో వినసాగాడు. మాటలు వినబడకపోగా వినబడిన రెండవగొంతు అతన్ని కలవర పెట్టింది.

అది రాజ్యలక్ష్మి మాట.

"అలివేలు, రాజ్యం రహస్యంగా మాట్లాడుకుంటున్నారు" అన్న విషయం స్ఫురణకు వచ్చినప్పుడు అతనికి కంగారు పుట్టింది.

"కొంపతీసి తన్నిగురించి అలివేలు రాజ్యంతో చెప్పడం లేదు గదా!... సందేహం లేదు. అదే జరుగుతుండి ఉంటుంది" అన్న నిర్ణయానికి రాగానే అతను గభాలున లేచి చొక్కా తీసుకున్నాడు.

అంతలో పక్కగదిలోంచి పకపక నవ్వులతో [illegible] అలివేలు బయటికి వచ్చింది. నవ్వుతూ రమణమూర్తివంక చూసి వెళ్ళిపోయింది.

అతను షర్ట్ వేసుకునేంతలో రాజ్యలక్ష్మి గదిలోకి వచ్చి అతనితో "మిమ్మల్ని గురించే చెప్తూంది అలివేలు" అంటూ నవ్వు నాపుకుంది.

"కొంచెం పనుంది. అలా వెళ్ళి వస్తా" అంటూ బయలుదేరబోయాడు రమణమూర్తి.

"ఏం చెప్పిందో వినరేం? [illegible] [illegible] [illegible] [illegible]" అని మళ్ళీ నవ్వింది.

[illegible] వెళ్ళిన వాళ్ళా వెనక్కి వచ్చి రాజ్యలక్ష్మివంక చూసి, తృప్తిగా పక్కన కూర్చుని రమణమూర్తి "మరి నాకు ఏం తెలుస్తుంది. మాకూ పాపం, పుట్టా కుంటే ..." ఈసారి తన కంగారు తలుచుకుంటే నవ్వొచ్చింది అతనికి.

"ఎంత [illegible] అయినా మరీ అంత అమాయకులేం!... కాఫీ పట్టుకొస్తాను ఎక్కడికీ వెళ్ళకండి" అని లోపలికి వెళ్ళింది రాజ్యలక్ష్మి.

చొక్కా విప్పేసి మంచంమీదికి చేరాడు. "తప్పు చేసినవాడికి కంగారు ఎక్కువ" అని నవ్వుకున్నాడు. అయితే అంతలోనే అతనికి తను చేసింది తప్పులేదనిపించింది. "తన ప్రవర్తి

నలో తప్పు కనబడవలసింది ఆమెకే కదా-మరి దాన్ని గురించి అలివేలు చెప్ప లేదంటే అర్థం?"... దేన్నో సాధించినంత ఆనందం కలిగింది అతనికి. జరిగినది మనస్సులో మెదల సాగింది..

వచ్చినప్పటినుంచీ తన దృష్టిని ఆకట్టేసింది. అలివేలు. ముద్దబంతిపూవులా ఉన్న అలివేలని చూసి మొదట ఊరికే "మనిషి చాలా బావుంది" అనుకున్నాడు. ఇంటిలోనే రోజంతా తిరుగుతూ ఒకటికి పదిసార్లు కనబడుతుంటే కొంచెం ప్రత్యేకించి చూసేపాటి శ్రద్ధ పెంచుకున్నాడు. "బావయ్యగారూ" అని సంబోధించి అతి చనువుగా మాట్లాడుతుంటే ఆమెను గురించే ఎక్కువ ఆలోచించసాగాడు. అరమరిక లేకుండా తన ఉనికికి భయపడనట్లుగా తిరుగుతుంటే ఈ విషయం తేల్చుకోవాలనుకున్నాడు.

పెళ్ళయాక వచ్చిన రెండు మూడు సార్లలోనూ కథ అంతవరకువచ్చి ఆగింది. అవకాశం కోసం ఉదయం తను మళ్ళీ కథని కదిలించి వదిలాడు.

రాజ్యలక్ష్మి పాతచీరని కట్టుకుని అలివేలు తనగదిని ఊడుస్తుంటే వచ్చాడు తను లోపలికి. ఒక్కక్షణం తటపటాయించి ఒక నిర్ణయానికి వచ్చాడు.

వెనగ్గావెళ్ళి చేతుల్తో ఆమెని చుట్టి దగ్గరగా లాక్కున్నాడు బలంగా!

అలివేలు తనని వదలించుకుందుకు ప్రయత్నిస్తూ "బావయ్యగారూ"అని ఖంగారుగా అనగానే ఏమీ ఎరగని వాడిలా "రాజ్యం అనుకున్నాను" అని గభాలున వదిలేశాడు.

నవ్వుకుంటూ వెళ్ళిపోయింది అలివేలు.

"మరి ఆ విషయం చెప్పలేదంటే—పరవా లేదు" అనుకున్నాడు రమణమూర్తి.

కళ్ళు మూసుకుని పడుకున్నా అతనికి అలివేలు రూపం కనిపించింది. "అలివేలు చాలా అందమయినది" అది అతని అభిప్రాయం.

పళ్ళుతోముకుంటూ బావిదగ్గర నీళ్ళుతోడి పోస్తున్న అలివేలుని చూస్తున్నాడు రమణమూర్తి. నాలుగుబారల్లోచాదని లాగిపారేస్తుంది. పక్కనకూర్చుని గిన్నెలు తోలుచుకుంటున్న రాజ్యం అలివేలుముందు అద్భుతంగా కనబడుతోంది అతని కంటికి. లేచి బావిదగ్గరకెళ్ళి అలివేలు చేతిలోంచి బకెట్టు అందుకున్నాడు.

ముఖం కడుక్కుంటూ "నువ్వుకూడా నాలుగు బొక్కెన్లు తోడరాదు రాజ్యం. అలివేలుచూడు ఇద్దరినీ అవలీలగా కొట్టేస్తుంది" అన్నాడు.

"బావయ్యగారు మంచి ఎత్తే వేస్తున్నారే. మా అమ్మాయిచేత ఇంటెడుపనులు చేయించుకునేందుకు! మా రాజమ్మకేం ఖర్మ వండి?"

"ఖర్మ పట్టి చేస్తున్నావేమిటి నువ్వు? కండకల వాడేను మనిషోయ్ అన్నారు."

నేను తోడాలేను, నాకుబలమువద్దు. అంతగా ఉంటే మా అలివేలుని తీసుకొస్తాను ఈ సారి నాపనేకాకుండా కావాలంటే మీ ఆఫీసుక్కూడా పోయొస్తుంది" అని నవ్వింది రాజ్యం.

నవ్వుతున్న అలివేలుని చూస్తూ "కబుర్లకున్నావు "అని దోసెడు నీళ్ళు ఇద్దరిమీదా పడేలాగు ఎగరేసి ఇవతలికి వచ్చేశాడు.

"మా రాజమ్మ గడుసుదికాదు కాబట్టి మీ ఆటలు సాగుతున్నాయండోయ్. నాలాటిదయితేనా బిందెడునీళ్ళు పోసేసేదాన్ని నెత్తిన."

"ఇప్పుడుమాత్రం పోయొద్దని ఎవరన్నారు? లేకపోతే వేడినీళ్ళయితే రోజూ అలాగే పోద్దువుగాని" అన్నాడు రమణమూర్తి నవ్వుతూ.

దూకి వస్తున్న సెలయేరులా వినబడింది అలివేలు నవ్వు అతనికి.

* * *

పొలంలో కుప్ప కొట్టిస్తున్న బావమరిదితో కాసేపు మాట్లాడి వాళ్ళు, వడ్లు ఎగబోయడం వగయిరాలు చూసి విసుగుపుట్టి పొలం గట్టు మీదుగా నడిచిపోయాడు రమణమూర్తి. చిన్నతనంనుంచి యాంత్రికజీవితం గడిపి పట్టణంలోని సందడికి అలవాటుపడిన అతనికి ఈ పల్లెటూరు ప్రశాంతత నచ్చింది. "కాని ఇక్కడ ఎక్కువ కాలం గడపడం కష్టం. కొత్తలో ప్రశాంతత అనుకున్నదే విసుగు పుట్టాక భయంకర నిశ్శబ్దంగాతయారవుతుంది" అని నవ్వుకున్నాడు.

పొలంగట్టు మీది మామిడిచెట్లు, పక్కగా

వున్న కొబ్బరి చెట్లతో పోటీపడలేక కనీసం ఏమయినా సంపాయించుకుందామని విస్తరించుకున్నాయి. వాటిమధ్య అభిప్రాయ బేధాలెలా వున్నా చల్లగాలి మాత్రం కలిసికట్టుగా సరఫరా చేస్తున్నాయి అన్నీకలిసి. అటువంటి వాతావరణంలో ఒళ్ళుమరచి నడుస్తున్నాడు.

పక్కనా ఏవో జరజరపాకడంలో ఉలికిపడి చూశాడు రమణమూర్తి. పాము పాక్కుంటూ పక్కగావున్న గడ్డిలోకి జారిపోయింది. అప్పటికి గాని అతనికి మసక చీకటిపడిన సంగతి తెలియలేదు. ఊరికేసి చూశాడు. దూరంగా అప్పుడే వెలుగుతున్న దీపాలు ఊరి ఉనికిని తెలుపుతున్నాయి.

"కొత్తగా ఇటొచ్చారేమిటి బావయ్యా గారూ" అని పిలుపువినటంతో అటుకేసి చూశాడు. ఆ పక్కనే వున్న కొబ్బరి తోటలోంచి ఒకామె వస్తోంది.

"ఇంత పొద్దుపోయేదాకా నువ్విక్కడున్నావేం?" ఎదురు ప్రశ్న వేశాడు.


"మా ఆయన ఈ తోటకి కాపుంటాడు. అడికి పోయొస్తున్నాను. తొరగా ఇంటికి పొండి. రాజమ్మ చూస్తుంటుంది" అని పక్కున నవ్వి ఊరికేసి చకచక నడవసాగింది.

"నేను కూడా వస్తానుండు-చీకట్లో ఒక్కదానివి పోలేవు!"

"భలేవారే-మీలాగా పిరికిదాన్ననుకున్నారా: కావాలంటే ఇక్కడే తెల్లవార్లూ ఉండిపోగలను కూడా! ఇక్కడే పుట్టిందానికి నాకేం భయం" అని కూనిరాగం తీసుకుంటూ నడిచిపోయింది.

రమణమూర్తి అమె వెంటనడిచి కాసేపు మాట్లాడుదామని అడుగేయబోయాడు కాని తన వెనక అడుగుల చప్పుడికి ఆగి వెనక్కి చూశాడు.

అరడుగుల పొడుగున నిండయిన విగ్రహం వెనకనుంచి వచ్చి అతన్ని దాటి ముందుకు పోయింది. సెంటువాసన గుప్పుమంది. గబగబ నడుస్తూ వెడుతున్న అతన్ని చూస్తూ "ఎవరు



చెప్మా, ఎక్కడో చూచినట్లుంది" అనుకున్నాడు రమణమూర్తి.

చప్పున గుర్తుకు వచ్చింది- "పెదనాయుడు గారి అబ్బాయి" అని దూరంనుంచి చూపించి వెంకయ్య చెప్పడం.

"మంచి జల్సాపురుషుడు" అని కూడా చెప్పాడు. ఈ సెంటు వాసనలు, అలంకరణ ఆ మాటనిఋజువు చేశాయి అనుకున్నాడు.

అంతలోనే రమణమూర్తికి ఒక సందేహం కలిగింది. "అలివేలు వచ్చిన కాసేపటికి ఇతనూ వచ్చాడు-పైగా ఆ కొబ్బరి తోట కూడా వీళ్ళదే నంటారు..." అని.

"అయితే అలివేలు.. " ఆ పైన ఇకనతను ఆలోచించలేదు. ఈలవేసుకుంటూ ఊరివైపు నడిచిపోయాడు.

ఇన్నాళ్ళూ తను చెడుగా ఊహించుతున్నానేమోనని భయపడుతున్న అతనికి ఇది ఎంతో ఉత్సాహాన్ని కలిగించింది. "మనుష్యుల్ని తేలిగ్గా చదవగలను రాజ్యం నేను" అంటుండేవాడు తను రాజ్యలక్ష్మితో ఎప్పుడూ.ఎందుకో తన మీద తనకి ఈ విషయంలో నమ్మకం ఎక్కువ. "అయితే ఈసారి కూడా తను ఓడలేదు."

అలివేలుని గురించిన ఆలోచనలు అతన్ని ముంచెత్తుతున్నాయి. సమయం కోసం ఎదురు చూస్తున్నాడు.

మర్నాటి సాయంత్రం గొడ్లసావిడికేసి వెళ్ళి బావమరది కొత్తగా కొన్న ఎడ్లజతని చూద్దామని బయలుదేరాడు రమణమూర్తి. "చాలా బావున్నాయి బావా. పొద్దున్న ఇంటికి తెచ్చాము- నువ్వులేవు. ఒకసారి ఎవర్నయినా వెంట బెట్టుకుని వెళ్ళి చూసిరా" అని చెప్పిచెప్పి పొలం వెళ్లాడు అతను. అవునుమరి. బోలెడు డబ్బుపోసి కొన్నవాటిని నలుగురికి చూపాలన్న కుతూహలం సహజం, చూడాలన్న ఉత్సాహం కూడా సహజమే! అందుకే బయలుదేరాడు.

లోపలికి వెళ్ళిన అతనికి కండ్లెదుట కన బడుతున్న దృశ్యం కన్నుల పండువగా ఉంది. పడుకున్న గిత్తలముందు కూచ్చుని వాటికి బొట్లు పెడుతోంది అలివేలు. తెల్లటి ఎడ్లు, వాటిముందు పచ్చటి అలివేలు-అలా చూస్తుండి పోయాడు రమణమూర్తి.

"ఏటి బావయ్యగారూ, అలా బొమ్మయి పోయారు ?" అంది అలివేలు.

"బొమ్మ అవడం కాదు అలివేలూ, బొమ్మని చూస్తున్నాను."

"ఎడ్లు మీ కంటికి బొమ్మల్లాగున్నాయా? ఛలేవారే మా అబ్బాయిగారు రెండువేలు పోసి కొన్నవి బొమ్మలా?" ఫక్కున నవ్వేసింది.

"ఆ నవ్వు హాయిగా అనిపించింది-ఆమెని చూస్తుంటే ఊగుతున్న గున్నమావిడి గుర్తు కొచ్చింది అతనికి.

"అవికాదు, నువ్వు. బంగారపు బొమ్మలా ఉన్నావు."

"ఓయబ్బో, మా రాజమ్మ నేర్పిందా ఏమిటి మీకీమాట! ఎప్పుడూ నన్ను అంటుంటుంది."

అతనేమీ మాట్లాడకుండా దగ్గరగా వచ్చాడు.

కొమ్ములకి రంగు రాయడం పూర్తిచేసి "అబ్బాయిగారు పిలిచి చెప్పాడు — "కొత్త గిత్తలకి నువ్వు రంగువేయి అలివేలూ, మిగిలిన వాటికి పాలేళ్ళు వేస్తారు" అని. పూర్తవకపోతే చంపేయడూ!... హమ్మయ్య ఎలాగున్నాయి?" అని కాసేపు వాటిని చూసి లేచినిలబడి బద్ధకంగా ఒళ్ళు విరుచుకుంది.

రమణమూర్తి ఒకసారిచుట్టూచూసి గభాలున వెళ్ళి ఆమెని బలంగా చేతులతో చుట్టేసి దగ్గరకు లాక్కున్నాడు. ముఖాన్ని తనవైపుకు తిప్పుకుంటూ "అలివేలూ, నీకోసం ఎన్నాళ్ళుగా ఎదురుచూస్తున్నా ననుకున్నావు?" అన్నాడు ఆవేశంగా.

ఈ హటాత్పరిణామంనుంచి కాసేపటికి కోలుకొని "ఏమిటి బావయ్యగారూ, ఏమిటి మీరు చేస్తున్నపని. ఛా, ఛా వదలండి" అంది విడిపించుకునేందుకు ప్రయత్నిస్తూ అలివేలు.

"ఎవరూ లేరులే అలివేలూ—నీకేం కావాలంటే అదిస్తాను" అంటూ పెదవుల మీదికి వంగాడు.

మరుక్షణంలో వెనకనున్నా గడ్డిమీదికి పడి పోయాడు.

"ఏందయ్యా పెద్దమనిషి ఏం కూశావ్?

ఏమనుకున్నావు? మా రాజమ్మ ముఖం చూసి ఊరుకుంటున్నా కాని లేకపోతేనా?... బుద్ధి కలిగి మెసలుకో. ఇదేం మీ బస్తీ అనుకున్నావేటి ప్రతిదీ కొనుక్కోటానికి? నా జబ్బసత్తువ ఎరగవ్ జాగ్రత్త... ఛీ, ఛీ. వెదవ మగాళ్ళు అంతా ఇంతే. చనువుగా మాటాడితే చాలు ఛూ!" అంటూ రంగుడబ్బాలక్కడే వదిలేసి ఏడుస్తూ వెళ్ళిపోయింది.

రమణమూర్తి మ్రాన్పడిపోయాడు. కొంతసేపటిదాకా లేవలేకపోయాడు, వెంటనే ఇంటికి వెళ్ళేందుకు మనస్సు ఒప్పక కాసేపు తిరిగి బిక్కుబిక్కుమంటూ ఇంటికి చేరుకున్నాడు. గదిలోకి వెళుతూంటేనే కనబడిన దృశ్యంతో నిలబడిపోయాడు.

లోపల రాజ్యలక్ష్మితో మాట్లాడుతున్న అలివేలు అతన్ని చూడగానే అవతలికి వెళ్ళిపోయింది. ఒకక్షణం తటపటాయించి అంతలోనే ఒక నిర్ణయానికి వచ్చి లోపలికి వెళ్ళి రాజ్యలక్ష్మి పక్కనే మంచం మీద కూర్చున్నాడు.

"నన్ను క్షమించవూ రాజ్యం! నేనివాళ ఒక తప్పు చేయబోయాను" అన్నాడు తల వంచుకుని.

"అలివేలు చెప్పిందండి".

"అవును; ఆ అమ్మాయినే అపార్థం చేసుకున్నాను. చక్కగా బుద్ధి చెప్పింది. నా గతం మర్చిపోయున్నాను. ఇకముందు ఇటువంటివి జరగవని చెబుతున్నాను. ఈసారికి క్షమించవా?"

రాజ్యలక్ష్మి కరిగిపోయింది.

"ఛ ఛా! మరీ స్కూలు కుర్రాడిలా ఇదయిపోతారేమిటండీ? మిమ్మల్ని నేనెరగనా? ఏదో ఒక్కొక్కసారి ఈ బలహీనత సహజం. అందులోనూ రేపోమాపో తండ్రి కాబోతున్న సమయంలో" నవ్వింది రాజ్యం.

తేలికపడిన మనస్సుతో ఆమె వంక చూశాడు.

"అలివేలూ అదే అంటుంది. బావయ్యగారితో అంత చనువుగా ఉండడం పాపం పొరపాటైపోయిందని... అయినా దాని తరహా అంత. చిన్నప్పటినుంచి నాతోపాటు మా ఇంటిలోనే తిరిగింది. నాతోపాటు నాన్నగారు దానికి కుట్టించిన బట్టలు కట్టుకుంది. పెళ్ళికూడా నాన్నగారే చేశారు. అందువలన మా ఇంటిలో మనిషిగా కలిసిపోయింది. "బావయ్యగార్ని జాగ్రత్తగా చూసుకో రాజమ్మ! ఊళ్ళో చాలామంది మంచివాళ్ళు కారు" అంది పోయేటప్పుడు. "ఆయన సంగతి నాకు తెలియదుటే! కాకపోతే "బావయ్యా" అన్నావని ఒకపట్టు పడదామనుకున్నారు" అన్నాను.

ఇద్దరూ నవ్వుకున్నారు.

"ఎవరికీ చెప్పదులెండి. అక్కడ ఎవరూ చూడలేదుటగా! అన్నయ్యకి తెలిస్తే పెద్ద గోలయిపోతుంది. దాని మీద ఈగ వాల నివ్వడు" అంది రాజ్యం.

"నువ్వు మంచిదానివి రాజ్యం" అన్నాడు నిండుగా రమణమూర్తి ఆమె చేతుల్ని తన చేతుల్లోకి తీసుకుంటూ.

ఈసారి అలివేలు జీవితంమీద ఆసక్తి పెరిగింది రమణమూర్తికి. "ఎటువంటిది ఆమె? అసలెవరు. తల్లి తండ్రి ఎవరూ కనబడరు! మరి ఆ నాయుడుకొడుకు ఈమె వెంట రావడంలోని విశేషం ఏమిటి? అవికూడ పూర్తిగా తెలిస్తేగాని తనకు ఆమెమీద ఒక అభిప్రాయం రాదు". తాను చేసిన మానసిక పరిశోధన పూర్తిగా తప్పని ఒప్పుకునేందుకు అతని మనస్సు అంగీకరించడంలేదు.

"అలివేలుమీద ఈగవాలనివ్వడు అన్నయ్య" అన్నరాజ్యం మాటలు గుర్తుకొచ్చాయి అతనికి. "ఏమయినాసరే అలివేలుని గురించి తెలుసుకోవాలి!" అనుకున్నాడు. వెంటనే అతనికి వెంకయ్య గుర్తుకొచ్చాడు. రాజ్యం వాళ్ళ చిన్నతనంలో అతనే వీళ్ళని ఆదరించేవాడు కాబట్టి అతన్నే అడగాలి" అని అనుకోవడం, వెళ్ళి అతన్ని అడిగేయడం కూడా జరిగాయి.

"అలివేలు తల్లి అయ్యగారింట్లో పనిచేసేది. దాని మొగుడు రోగిష్టి మనిషయితే బాబుగారే ఏదోపని సూపారు తనదగ్గరనే. బంగారు-అదే అలివేలు తల్లిపేరులెండి. సానా బావుండేది. ఇంటెబుపని చేసేది. ఈ పిల్ల బూమ్మీదపడినాక

ఏడాదికి మొగుడుపోయాడు బంగారుకి. తరువాత కొన్నాళ్ళకి వనిమానేసి తనింటికాడే ఉండిపోయింది బంగారు.

చిన్నతనం నుంచి అలివేలు బాబుగారింట్లోనే తిరిగిందండి. తిండీ, బట్టాఅన్నీ ఈడనే జరిగాయి. దీనికి ఈడొచ్చేసరికి ఆళ్ళమ్మ కన్నుమూయడంతో దీన్ని ఒకింటిదాన్నిచేసే బరువు కూడా బాబుగారే మీదేసుకున్నారు. తనయితే *అయ్యగారి మనస్సుని అక్కడనే నొప్పించిం*దండి ఈ పిల్ల" అని ఆగాడు వెంకయ్య.

"ఏం చేసిందేమిటి ?"

"ఆయనగారు దీని జీవితం సుకంగా పెళ్ళిపోయేందుకు డబ్బుపోసి మంచి సంబంధం చూసి చేద్దామనుకున్నారండి, కాని ఈ సన్నాసి మరొక సన్నాసిని "పేమించినాను, ఆడినే కట్టుకుంటాను" అని మొండికేసిందండి.

ఆయన చెప్పారు. నా చేత చెప్పించారు, వినలేదండి! వాడుట్టి దగుల్బాజీ వెధవని అయ్యగారి నమ్మకమండి. చివరికి ససేమిరా అని ఇది మొండట్టేసరికి ఆడికే ఇచ్చి సేసినారండి. కన్నకూతురు కిచ్చినట్లు సారె చీర, ఒక కుంట నేల ఇచ్చినారండి."

"అయితే ఇప్పుడు వాడెలా ఉన్నాడు ?"

"ఏ లోకానున్నారో కానీండి బాబుగారు - ఆయన పుస్తకాల్ని చదివినట్టు సదివేసేవారండి మనుష్యుల్ని. "మంగ మొగుడు వెదవ సన్నాసిరా వెంకడూ, వాడు డబ్బుకోసం చేయలేని పనుండదు. పిచ్చిది ఆ కటిక వాడినే నమ్మింది" అంటుండేవారండి. అలివేలుని ఆయన "మంగా" అని పిలిచేవారులెండి. దీనికీ పేరెట్టింది కూడా ఆయనేనండి!

సరిగా అలాగే చేస్తున్నాడండి వాడు. వారిచ్చిన కుంట పొలం వాడు దాహం పుచ్చుకుందుకు చాల్లేదండి, దాని ఒంటి మీద చిన్నం చిదరా ఉంటే ఊడ్చేశాడు. ఇదంత బాబుగారు పోయాక ఈ రెండు సంవత్సరాల్లోనండి! ఇప్పుడు నాయుడు కొబ్బరి తోటకి కాపుదల ఉంటున్నాడండి. కాని అబ్బాయిగారు, ఆడి మాటమీద నాకు నమ్మకం లేదండి."

"అంటే" కుతూహలంగా అడిగాను.

"నాయుడి కొడుక్కి వీడు కుడిభుజమండి. ఆయనకి కావలసినవన్నీ ఏర్పాట్లు ఈడు చేస్తాడండి...ఆడు పరమవెదవండి. దాని రెక్కలమీద ఆడి బతుకు...ఏమాటకామాటే చెప్పుకోవాలండి-ఆయన పెద్దబ్బాయిగారు అలివేలకి ఏ లోపం రానీయడండి!

తనలో పెరుగుతున్న అనుమానాన్ని ఇక నాపుకోలేకపోయాడు రమణమూర్తి. "వెంకన్నా ఒక్కటి అడుగుతాను దాచకుండాచెప్పు" అన్నాడు.

తటపటాయించాడు వెంకయ్య. "అడగండి" అన్నాడు.

"అలివేలుమీద మా మావగారికి అంత అభిమానం ఎందుకుండేవంటావు ?"

"ఎందుకేవిటండి ఇంట్లో పిల్లల్తోపాటు పెరిగినపిల్ల, పైగా బాబుగారూ, గొప్పోరికి ఎవరిమీద ఎందు కభిమానం పుడుతుంటో మనకెలా తెలుస్తుందండి? చదువుకున్నవారు-మీకు నే చెప్పాలా ఏటండి, ఆలోచించండి."

రమణమూర్తికి అతని మాటలు చిత్రంగా తోచాయి. అతని వంక చూశాడు కాసేపు. తరువాత "వెళ్ళా వెంకయ్యా" అంటూ వచ్చేశాడు. అతని మాటలు మాత్రం రమణమూర్తి మనస్సులోనే ఉండిపోయాయి.

చీకటి పడుతోందన్న హెచ్చరికగా వీధిలో దీపాలు వెలిగాయి. టైము చూసుకున్నాడు. గబగబ నాయుడుగారి కొబ్బరితోటకేసి నడక సాగించాడు- "అలివేలు చరిత్రలో ఇంకా తెలుసుకోవలసింది కొంతఉంది. ఈరోజు కూడా ఇద్దరూ కనబడతారేమో చూద్దాం" అనుకుంటూ.

తోటదగ్గర కొచ్చేసరికి చీకటి పడిపోయింది. గేటు దగ్గర ఆగాడు లోపలికి వెళ్ళటమా, మానడమా అని. అంతలోనే ఎవరో పరుగెత్తుకు వస్తున్న శబ్దమూ, ఆ వెనక మరొక అడుగుల చప్పుడూ వినబడి ఆగి తరువాత గాజుల చప్పుడు వినబడ్డాయి. అంతలో "నీ చేతులుపడ, చచ్చినాడా వదులు. చంపేస్తాను" అన్న అలివేలు మాటలు అతనికి కర్తవ్యాన్ని బోధించాయి.

ఒక్క దూకులో లోపలికి వెళ్లాడు. ఎదురుగా మనిషి నిలబడడంతో దౌర్జన్యం చేయబోయిన నాయుడుగారబ్బాయి అలివేలుని వదిలేశాడు.

సన్నివేశం అర్థంఅయింది రమణమూర్తికి.

అంతవరకు శక్తికూడకట్టుకుని ప్రతిఘటిస్తున్న అలివేలు అతన్ని చూడగానే కుప్ప కూలిపోయి భోరున ఏడవసాగింది.

నాయుడు కొడుకు ఒక్కసారి రమణమూర్తి వంక చూచి తరువాత అలివేలుతో "అండ చూసుకుని తప్పించుకున్నావు. కాని ఎక్కడికి పోతావు? నీ అంతు చూడకపోతే నా పేరు రంగారావు కాదు" అని విసవిసవెళ్ళిపోయాడు.

ఏం చేయాలో తేల్చుకోలేని రమణమూర్తి అలివేలువంక చూశాడు.

"నన్ను కాపాడారు బావయ్యగారు" అంది చంటిపిల్లలా ఏడుస్తూ అలివేలు.

కరిగిపోయాడు రమణమూర్తి. "పిచ్చిదానా! నీ మంచితనమే కాపాడుతుంది. పద ఇంటికి పోదాం. నిన్ను దిగబెట్టి వాడింటికి వెళ్ళి వాడి అంతు చూస్తాను. స్కౌండ్రల్!"


"వద్దు బావయ్యగారూ! వాడసలే పాము. ఈ రోజు మా ఇంటాయన్ని ఎక్కడికో పంపేసి తాను కూర్చున్నాడు. అటువంటివాడిని తప్పించుకు తిరగడం మంచిది. పగ పట్టాడా కాటేయక మానడు. అక్కడికీ మా ఇంటాయనకి చెబుతుంటాను-ఇంతకన్నామంచిపనిపెద్దబ్బాయి గారికి చెప్పి ఇప్పిస్తాను రావయ్యా అని. ఆడు రాడు. మరి ఆరింటికాడ ఉంటే వీడి తాగుడు గీగుడు సాగదు. ఇక్కడ ఇద్దరూ కలిసి తందనాలాడతారు!" అని కాసేపాగి "పెద్ద బ్బాయిగారికి చెప్పకండి బాబూ-నామీద ఒట్టే! వింటే వాడి రక్తం కళ్ళచూస్తేగాని వదలడాయన!" అంది అలివేలు దారిలో.

ఇంటికొచ్చేసరికి తనకోసమే అంతా ఎదురు చూస్తుండడంతో సిగ్గుపడ్డాడు.

"ఎక్కడున్నావు బావా ఇంతసేపు?" అనడిగాడు పెద్ద బావమరిది.

"కాలవగట్టున గాలివేసి వస్తూంటే దారిలో అలివేలు కలిసింది".

"అన్నట్టు అలివేలూ, రేపు మీవాడిని కూడా



లాక్కురా! పెద్దపండుగ, ఇక్కడే ఉంటాడు"

"సర్లే అన్నయ్యా. వాడు రేపసలు మన స్వగ్రహాలో ఉంటాడంటావా. స్వర్గానికి బెత్తెడు దూరంలో వాడి మకాం" అంది రాజ్యలక్ష్మి.

అంతా నవ్వుకున్నారు.

అందరితో బాటు కొత్త బట్టలు కట్టుకుని హడావుడిగాతిరుగుతున్న అలివేలుని చూస్తుంటే రమణమూర్తికి వెంకయ్యా చెప్పిన విషయాలు గుర్తుకొచ్చాయి.

రాత్రి భోజనాలయినాక ఇంటికి వెళతానని బయలుదేరిన అలివేలుని "నీ ముఖం, ఇంత రాత్రి ఎక్కడికి పోతావు? ఇక్కడే పడుకో" అని కేకలేసింది రాజ్యం తల్లి.

రాజ్యంమాత్రం "భలేదానివమ్మా, పండగ పూట వాళ్ళనిద్దరినీ విడదీస్తావు? పైగా వాడు ఇప్పటికి రెండు కబుర్లంపాడు. వెళ్ళవే పిల్లా!" అని సాగనంపింది అలివేలుని.

"ఇక నా ప్రయాణం ఒక్క రోజులో పడింది రాజ్యం. నే వెళ్ళేలోపల అబ్బాయి నో. అమ్మాయినో చూపించవూ?" అన్నాడు గదిలో రాజ్యంతో.

"సర్లెండి. ఈ రోజే ఆ ముహూర్తం వచ్చేట్లుంది" అంది రాజ్యలక్ష్మి అటూ ఇటూ కదులుతూ.

బయట ఘొల్లున గోలలతోటి మెలకువ వచ్చి బయటికి వచ్చాడు రమణమూర్తి.

సూర్యోదయం అవుతున్నట్లుగా ఆకాశం లోకి ఎరుపు పారుతోంది. మంటలు పోటీపడి ఆ ఎరుపుని అందుకోబోతున్నాయి.

ఖంగారుగా గబగబ వీధిలోకి వచ్చాడు. "మన అలివేలు ఇల్లుట బావా!" అతని పక్క నుండి పెద్ద బావమరిది పరుగెత్తడంతో తను అతని వెంటబడ్డాడు.

దగ్గరకు వెళ్ళలేక దూరం నుంచే నీళ్ళు చల్లేందుకు ప్రయత్నిస్తున్నారు అక్కడ చేరినవాళ్ళు. క్షణంలో మొత్తం భస్మం చేయా లని పంతం పట్టినట్టుగా ప్రజ్వరిల్లి పోతున్నాయి మంటలు.

జనంలో ఎవరో గొల్లున ఏడుస్తూంటే అటుకేసి పరుగెత్తాడు అలివేలన్న ఆశతో రమణమూర్తి.

"నా కొంప కేం నిప్పంటించుకున్నావు దేముడోయ్! ఆ ఎదవ పోయించింది తాగి ఆడిని ఇంటోకే పంపాను భగవంతుడోయ్! నా అలివేలుని పొట్టనెట్టుకున్నానురోయ్. అది పతివ్రతరోయ్!" అని నెత్తినోరు బాదుకుంటు న్నాడు.

అతని మాటల్లోని నిజాన్ని గ్రహించేసరికి రమణమూర్తికి మతిపోయినట్లయింది. "ఎంత పని చేశావురా వెధవ" అని ఆశ్చర్యపోయాడు.

అంతలో ఆ మంటలమధ్యనుంచి ఒక మనిషి కదుల్తున్న మంటలాగా రివ్వున వచ్చి ఆ ఏడుస్తున్న వ్యక్తి జబ్బపుచ్చుకుని "వాడు వచ్చాడు. ఇక నీవంతు - మన ఎదవబతుకం ఇంతటితో ఆఖరు" అని బరబర మంటల్లోకి ఈడ్చుకుపోయింది.

పక్కనున్న వాళ్ళు జరిగింది తెల్సుకునే సరికి వాళ్ళు ఆ మంటల్లోకి అదృశ్యమయినారు.

తాను చూసినదానికి విభ్రాంతుడై పోయాడు రమణమూర్తి" నిప్పుదగ్గరకు వెడితే సెగకొడుతుంది. తాకితే కాల్చేస్తుంది. తాను కూడా భస్మమయి పోతుంది. అలివేలు మన సాంప్రదాయానికి ప్రతినిధి" అప్రయత్నంగా ఆమంటలుకేసిచేతులుజోడించివెనక్కితిరిగాడు.

ఇంటికి వచ్చిన అతనికి వరండాలో అత్త గారు, బావమరుదులు దిగులుగా కూర్చుని ఉండం కనిపించింది. తను కూడా వెళ్ళి చిన్న బావమరిది పక్కన కూర్చొబోయాడు.

"వాళ్ళని ముట్టుకోకు నాయనా!" అంది అత్తగారు.

ఎందుకని అతను అడగలేదు - గ్రహిం చాడుకాబట్టి.

అంతలో లోపలి గదిలోంచి నాటు మంత్రసాని బయటికి వచ్చి "ఈ రోజే పురుడొచ్చింది అమ్మగారూ" అంది.

"తప్పకుండా వస్తుందని నాకు తెలుసు" అందావిడ.

అలివేలు అతని కళ్ళలో మెదిలింది.

★